www.prajasakti.com

ప్రజాశక్తి

బుధవారం 18 సెప్టెంబర్ 2024



రేపు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

ఈనెల 19వ తేదీ గురువారం కుప్పం ఎంపిడిఓ కార్యాలయంలో ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టమ్) కార్యక్రమాన్ని ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి నియోజక వర్గ, మండల స్థాయి అధికారులు హాజరు కావాలని, నియోజకవర్గ ప్రజలు తమ సమస్యల పరిష్కారానికి ఈ కార్యకమాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో కోరారు.



మంత్రి లోకేష్ పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన జెసి, ఎమ్మెల్యే

మంత్రి లోకేష్ పర్యటన ఏర్పాట్ల పరిశీలన

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, వైద్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ గురువారం బంగారుపాళ్యం మండలం ప్రభుత్వ ఆసుపత్రిలో నూతన డయాలసిస్ కేంద్రాన్ని ప్రారంభించన్నుట్లు జాయింట్ కలెక్టర్ విద్యాధరి తెలిపారు. ఈసందర్భంగా మంగళారం మంత్రి పర్యటనకు సంబంధించిన జరుగుతున్న ఏర్పాట్లను ఎమ్మెల్యే కలికిరి మురళీ మోహన్‌తో కలిసి పరిశీలించారు. జెసి మాట్లాడుతూ ఈనెల 19వ తేదీ గురువారం మండల ప్రభుత్వ ఆసుపత్రిలో డయాలసిస్ కేంద్రాన్ని కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. మంత్రి పర్యటనకు సంబంధించి ఏర్పాట్లు, పనుల పరిశీలకు తగిన సిబ్బందిని ఏర్పాటు చేయాలని తెలిపారు. ఆర్‌డిఓ మనోజ్ కుమార్, పిఆర్ ఈఈ చంద్రశేఖర్, టిడిపి మండల అధ్యక్షులు జయప్రకాష్ నాయుడు, జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షులు కోక ప్రకాష్ నాయుడు, మాజీ జెడ్పిటిసి వెంకటేశ్వర చౌదరి, సింగిల్ విండో మాజీ అధ్యక్షులు హేమచంద్ర నాయుడు, తహశీల్దార్ బాబు రాజేంద్ర ప్రసాద్, ఎంపిడిఓ శివశంకర్, ఎంఈవోలు నాగేశ్వరరావు, రమేష్, వైద్యాధికారి శిరీష, మాజీ సర్పంచులు, కమలనాథరెడ్డి, కోందండ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

విశ్వకర్మ విశ్వాన్ని సృష్టించిన దేశ శిల్పి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: విశ్వకర్మను ప్రపంచంలోనే మొట్టమొదటి వాస్తు శిల్పిగా భావిస్తారని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం విశ్వకర్మ జయంతి సందర్భంగా జిల్లా సచివాలయంలోని పాత గ్రీవెన్స్ హాల్‌లో జిల్లా కలెక్టర్ శ్రీవిరాట్ విశ్వకర్మ చిత్రపటానికి పూలమాలలు వేసి పుష్పాంజలి ఘటించారు. ఈ కార్యక్రమానికి జిల్లా జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విశ్వకర్మ జన్మదిన సందర్భంగా గురువారం విరాట్విశ్వకర్మ జయంతి మహోత్సవాలను నిర్వహించడం జరుగుతున్నదని, ఈ సందర్భంగా శిల్పకారులను, కళాకారులను గౌరవించుకోవాలన్నారు. జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ అధికారి రబ్బానీ బాషా, డిఆర్‌డిఏ పిడి తులసి, సోషల్ వెల్ఫేర్ డిడి రాజ్యలక్ష్మి, కలెక్టరెట్ ఏఓ కులశేఖర్ పాల్గొన్నారు.



విశ్వకర్మ చిత్రపటానికి పూజలు చేస్తున్న జిల్లా కలెక్టర్

కుప్పం రూరల్ : సృష్టికర్త విశ్వకర్మ జయంతి వేడుకలను కుప్పంలోని విశ్వబ్రాహ్మణ సంఘంలో ఘనంగా నిర్వహించారు. విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు సంతోష్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకలలో టిడిపి కుప్పం నియోజకవర్గ సలహాదారులు నరేష్ ఆచారి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. విశ్వకర్మ విగ్రహాన్ని ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

జిల్లాలో హార్టికల్చర్ డైరెక్టర్ పర్యటన

అంటుకట్టిన కూరగాయల నారుపై 3 రోజుల పాటు 14 రాష్ట్రాల ప్రతినిధులకు శిక్షణ

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్, బంగారుపాళ్యం:

కుప్పం సీవోఈలో ఉత్పత్తి చేస్తున్న అంటుకట్టిన కూరగాయల నారు రైతులకు ఎంతో లాభదాయకంగా ఉందని డైరెక్టర్ ఆఫ్ హార్టికల్చర్ డాక్టర్ కే.శ్రీనివాసులు పేర్కొన్నారు. మంగళ వారం ఆయన చిత్తూరు జిల్లా పర్యటనలో భాగంగా తొలుత బంగారుపాల్యం మండలంలో మామిడి తోట ను సందర్శించి రైతుతో ఉద్యాన పంటల సాగు ప్రయోజనాలపై చర్చించారు. ప్యాక్ హౌసుల సబ్సిడీ పెంచాలని రైతులు కోరారు. అనంతరం బంగారుపాళ్యంలో ఎంఐడిహెచ్ కింద ఏర్పాటు చేసిన కలెక్షన్ సెంటర్‌ను పరిశీలించగా జిల్లా ఉద్యానవన శాఖాధికారి మధుసూధన్ రెడ్డి ఈ కలెక్షన్ సెంటర్ రైతులకు ఏ విధంగా ఉపయోగపడుతున్నాదో వివరించారు. కుప్పంలోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో కూరగాయల నారును అంటుకట్టడం, అంటుకట్టిన కూరగాయల నారు సాగుచేసే విధానం, మట్టి లేకుండా నీటితో ఇతర రూటింగ్ మీడియాతో సాగు చేసే విధానంపై మూడు రోజుల శిక్షణా కార్యక్రమంను డైరెక్టర్ ఆఫ్ హార్టికల్చర్ వారు, కడా ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్ కలసి ప్రారంభించారు. ఈ సమావేశంలో శ్రీనివాసులు వారు మాట్లాడుతూ కుప్పం సిఓఈలో ఉత్పత్తి చేస్తున్న అంటుకట్టిన కూరగాయల నారు రైతులకు ఎంతో లాభదాయకంగా ఉందని, దేశంలోనే కూరగాయల నారుపై అంటుకట్టే విధానం కేవలం కుప్పం సిఓఈలోనే ఉందని దీని ద్వారా ఆంధ్రప్రదేశ్‌తో పాటు కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలలోని రైతులు కూడా లబ్ధి పొందుతున్నారని అన్నారు. సీఓఈ ప్రతి ఏటా దాదాపు ఒక కోటి నారు మొక్కలు ఉత్పత్తి చేస్తూ దేశంలోనే అన్ని సిఓఏల కన్నా ముందంజలో ఉందని తెలిపారు. ఇతర రాష్ట్రాల సీఓఈల నుంచి వచ్చిన నోడల్ ఆఫీసర్లు ఈ మూడు రోజులు శిక్షణ కార్యక్రమంపై అవగాహన పెంచుకొని వారివారి రాష్ట్రాలలో సైతం ఈ టెక్నాలజీని మరింత వ్యాప్తి చెందే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ మాట్లాడుతూ కుప్పం అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ఉద్యాన పంటల సాగును మరింత ప్రోత్సహించి రైతులకు లాభసాటిగా మార్చడానికి ప్రత్యేక ప్రణాళిక రూపొందించి సమగ్ర అభివృద్ధికి బాటలు వేస్తున్నట్లు తెలిపారు. ఇజ్రాయిల్ ఎంబసీ ప్రాజెక్ట్ ఆఫీసర్ బ్రహ్మదేవ్ సీఓఈ కార్యక్రమాలను ఇతర రాష్ట్రాల రైతులకు చేరువ చేయడానికి ఎంబసీ తోడ్పాటు అందిస్తుందని తెలిపారు. ప్రాజెక్ట్ డైరెక్టర్ ఏపీఎంఐపి బాలసుబ్రమణ్యం, ఇక్రిశాట్ శాస్త్రవేత్తలు, దేశవ్యాప్తంగా 14 రాష్ట్రాల నుంచి 16 సిఓఏల నుంచి నోడల్ ఆఫీసర్స్, జిల్లాలోని ఉద్యాన అధికారులు పాల్గొన్నారు.



బంగారుపాళ్యంలో మామిడి సాగును పరిశీలిస్తున్న డాక్టర్ కె.శ్రీనివాసులు

యువతకు ఏచూరి స్ఫూర్తి



ఏచూరి సంస్మరణ సభలో లెఫ్ట్, కాంగ్రెస్ నేతలు

ప్రజాశక్తి - తిరుపతి (మంగళం)

వ్యక్తిత్వ వికాసంతో కమ్యూనిజం భావాజలం కలిగిన కామ్రేడ్ సీతారాం ఏచూరి తన ప్రసంగాలతో అందరి దష్టిని ఆకర్షించిన గొప్ప మానవతావాది అని వక్తలు ఉద్ఘాటించారు. మంగళవారం కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ ఆధ్వర్యంలో తిరుపతి ప్రెస్ క్లబ్లో సీపీఐ (ఎం) జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి సంస్మరణ సభను వామపక్ష రాజకీయపార్టీలు, వివిద కార్మిక సంఘాల నాయకులతో కలిసి నిర్వహించారు. సీపియం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు మాట్లాడుతూ తిరుపతితో సీతారాం ఏచూరికి ప్రత్యేక అనుబంధం ఉందని, కేంద్రంలోని బిజేపి ప్రభుత్వం ప్రతిపక్షాలను పక్కకు నెట్టేసి నల్ల చట్టాలను అమలులోకి తీసుకోచ్చారన్నారు. సీతారాం ఏచూరి ఆశయాలకు శ్రమిద్దామన్నారు. ఎస్వీయూ మాజీ ఉపకులపతి రామ్మూర్తి మాట్లాడుతూ ఇందిరా గాంధీని ఎదుర్కొన్న దీరుడు సీతారాం ఏచూరి అన్నారు. బహుముఖ ప్రజ్ఞశాలి అని సీతారాం ఏచూరిని అనడంలో అతిశయోక్తిలేదన్నారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి మాట్లాడుతూ కమ్యూనిస్టుగా గుర్తింపు పొందిన సీతారాం ఏచూరి భారతీయ పురాణాలు పూర్తిగా అవగాహన కలిగిన వ్యక్తిగా తన వైవాహికం, సతానంపై పార్లమెంటు సాక్షిగా ప్రపంచానికి చెప్పారని అన్నారు. ఈ సంస్మరణ సభలో మాజీ ఎంఎల్సి యండపల్లి శ్రీనివాసులరెడ్డి, నాయకులు చిన్నం పెంచులయ్య, హరిక్రిష్ణ, వెంకటరత్నం, కుమార్‌రెడ్డి, యార్లపల్లి గోపి పాల్గొన్నారు.

శ్రీవారి భక్తులకు నాణ్యమైన భోజనం అందించాలి : ఈవో

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

తిరుమల శ్రీవారి దర్శనానికి విచ్చేసే భక్తుల ఆరోగ్య భద్రతకు టీటీడీ అత్యంత ప్రాధాన్యతనిస్తుందని, అందుకే తిరుమలలోని హెూటళ్ల వ్యాపారులకు ఆహార భద్రత విభాగంతో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు టీటీడీ ఈవో జె శ్యామలరావు తెలిపారు. ఆస్థాన మండపంలో టీటీడీ ఆరోగ్య, ఎస్టేట్స్ విభాగాలు ఆహార భద్రత విభాగంతో కలసి ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఈవో ప్రసంగిస్తూ తినుబండారాల దుకాణాలు, ముఖ్యంగా ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు ఆహార భద్రతా చట్టాలను పాటించాలని, లేనిపక్షంలో ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. డిప్యూటీ ఈవోలు ఆశాజ్యోతి, వెంకటేశ్వరులు, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ మధుసూదన ప్రసాద్, విఎస్‌వో సురేంద్ర, ఫోస్టాక్ ట్రైనర్ ఆంజనేయులు పాల్గొన్నారు.

నేడు పౌర్ణమి గరుడసేవ

తిరుమల శ్రీవారి ఆలయంలో సెప్టెంబరు 18వ తేదీన పౌర్ణమి గరుడసేవ జరగనుంది. రాత్రి 7 నుండి రాత్రి 9 గంటల నడుమ సర్వాలంకార భూషితుడైన శ్రీమలయప్ప స్వామివారు సువర్ణకాంతులీనుతున్న గరుడునిపై తిరుమాడ వీధులలో ఊరేగుతూ భక్తులకు దర్శనమిస్తారు.

శాస్త్రోక్తంగా చక్రస్నానం

తిరుమలలో అనంత పద్మనాభవ్రతం సందర్భంగా మంగళవారం ఉదయం శ్రీవారి పుష్కరిణిలో శాస్త్రోక్తంగా చక్రస్నానం నిర్వహించారు. తిరుమలలో శ్రీవారి బ్రహ్మోత్సవాలలో చివరి రోజున, వైకుంఠ ద్వాదశి, రథసప్తమి, ఆనంత పద్మనాభవ్రతం పర్వదినాలలో మాత్రమే చక్రస్నానం నిర్వహిస్తారు.

ఈవో, అదనపు ఈఓ విస్తత తనిఖీలు

టిటిడి ఈవో జె.శ్యామలరావు, అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరితో కలిసి మంగళవారం తిరుమలలోని సిఆర్‌ఓ జనరల్, నారాయణగిరి షెడ్లు, క్యూ లైన్‌లను తనిఖీ చేశారు. గత మూడు రోజులుగా వరుస సెలవులు, పెరటాసి మాసం రావడంతో తిరుమలలో భక్తుల రద్దీ పెరగడంతో పాటు, ఎస్ఎస్‌డీ టోకెన్లు లేని భక్తులకు దాదాపు 20 నుండి 24 గంటల సమయం శ్రీవారి దర్శనానికి పడుతోందన్నారు. నారాయణగిరి షెడ్లు, బయట క్యూ లైన్ల వద్ద అన్నప్రసాదాలు, పాలు, తాగునీరు పంపిణీని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సిఈ సత్యనారాయణ, డిప్యూటీవోలు భాస్కర్, హరేంద్రనాథ్, వి ఎస్ ఓ సురేంద్ర, సిపిఆర్వో టి.రవి పాల్గొన్నారు.

32 మందిపై బైండోవర్ కేసులు

తిరుమల ఒన్ టౌన్, టు టౌన్, క్రైమ్ పోలీస్ లు తిరుమలలో అనుమానాస్పదంగా, ఎటువంటి గుర్తింపు కార్డులు లేకుండా తిరుగుతున్న 32 మంది వ్యక్తులను పట్టుకొని వారి పైన కేసు నమోదు చేశారు. తిరుపతి తాసిల్దార్ వద్ద బైండోవర్ కోసం పంపామని లా అండ్ ఆర్డర్ పోలీసులు తెలిపారు.



తనిఖీల్లో భాగంగా ప్రసాదాలను రుచి చూస్తున్న ఈవో

నేడు డిసెంబర్ ఆర్జితసేవా కోటా విడుదల

శ్రీవారి ఆర్జిత సేవా టికెట్లకు సంబంధించిన డిసెంబరు నెల కోటాను సెప్టెంబరు 18న ఉదయం 10 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. ఈ సేవాటికెట్ల ఎలక్ట్రానిక్ డిప్ కోసం సెప్టెంబరు 20వ తేదీ ఉదయం 10 గంటల వరకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చు. ఈ టికెట్లు పొందిన వారు సెప్టెంబరు 20 నుండి 22వ తేదీ మధ్యాహ్నం 12 గంటల లోపు సొమ్ము చెల్లించిన వారికి లక్కీడిప్‌లో టికెట్లు మంజూరవుతాయి.

ప్రతి అడుగు.. స్వచ్ఛత వైపు..



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్

15 రోజుల పాటు స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలు : కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: స్వచ్ఛతాహి సేవ కార్యక్రమంలో అందరి భాగస్వామ్యంతో విజయవంతం చేద్దామని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లాలోని మునిసిపల్ కమిషనర్లు, ఎంపిడిఓలు, ఈఓపిఆర్‌డిలతో 17వ తేదీ నుంచి ప్రారంభమవుతున్న స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా చేపట్టాల్సిన అంశాలకు సంబంధించి జిల్లా జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరితో కలసి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ సుమిత్ కుమార్ మాట్లాడుతూ స్వచ్ఛతాహి సేవ కార్యక్రమాలను ఈనెల 17వ తేదీ నుండి అక్టోబర్ 1వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమాలన్ని మున్సిపాలిటీ, గ్రామ పంచాయతీలలో నిర్వహించాలని అధికారులందరూ సమన్వయం చేసుకొని పనిచేయాలన్నారు. ప్రధానంగా ప్రజాప్రతినిధులను, ప్రముఖులను భాగస్వాములను చేస్తూ స్వచ్ఛతా హి సేవపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. షెడ్యూల్ ప్రకారం 15రోజులపాటు చేపట్టనున్న కార్యక్రమాలకు సంబంధించి ప్రణాళికలను సిద్ధం చేయాలని డిపిఓను, మునిసిపల్ కమిషనర్లను ఆదేశించారు.

పచ్చదనాన్ని పెంచండి: ఎంపీ దగ్గుమళ్ళ

ప్రకృతి పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని, పచ్చదనాన్ని పెంచేందుకు, మొక్కలు నాటాలని చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు ప్రజలకు పిలుపునిచ్చారు. నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా వారి ఆధ్వర్యంలో మంగళవారం యాదమరి మండలం సమీపంలోని మహాసముద్రం జాతీయ రహదారి పరిసర ప్రాంతాలలో మొక్కల నాటి కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఎంపి మాట్లాడుతూ ఆధునిక పోకడలు ప్రకృతి వినాశనానికి దారితీస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రపంచానికి ప్రమాదకారిణిగా తయారైన కాలుష్య నియంత్రణకు, పచ్చదనాన్ని పెంచడమే సరైన మార్గమన్నారు. కార్యక్రమంలో మాజీ మేయర్ కటారి హేమలత, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, పిడి కార్తీక్ రెడ్డి పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న ఎంపి

చిత్తూరు నగర పాలకలో ప్రతిజ్ఞ

నగరాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని.. ప్రతి అడుగు స్వచ్ఛత వైపు వేయాలని నగర మేయర్ ఎస్.అముద, కమిషనర్ పి.నరసింహ ప్రసాద్ పిలుపునిచ్చారు. స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమంలో భాగంగా మంగళవారం నగరపాలక కార్యాలయ ఆవరణంలో అధికారులు, నగరపాలక ఉద్యోగులు స్వచ్ఛత ప్రతిజ్ఞ చేశారు. ఇందులో భాగంగా చిత్తూరు నగరపాలక సంస్థ పరిధిలోనూ అక్టోబర్ రెండో తేదీ వరకు పలు కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు వివరించారు. కార్యక్రమాల్లో నగరపాలక అధికారులు, ఉద్యోగులతో పాటు ప్రజాప్రతినిధులు, నగర ప్రజలు, యువత, విద్యార్థులు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. పరిసరాల పరిశుభ్రత అంశంపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. సహాయ కమిషనర్ ఎ.ప్రసాద్, ఎంహెచ్వో డాక్టర్ అనిల్ కుమార్ నాయక్, ఎంఈ గోమతి, డీఈ వెంకట ప్రసాద్, మేనేజర్ గోపాలకృష్ణ వర్మ, శానిటరీ ఇన్స్పెక్టర్లు, ఏఈలు పాల్గొన్నారు.



వెదురుకుప్పంలో..

వెదురుకుప్పం : పర్యావరణ పరిరక్షణలో భాగంగా గ్లోబల్ వార్మింగ్‌ని తగ్గించేందుకు చెట్లను నాటాలని, మొక్కలను నాటి వాటిని పరిరక్షించుకున్నప్పుడే వాతావరణ కాలుష్యం తగ్గి ప్రకృతి బాగుంటుందని డాక్టర్ వైయస్సార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోనూ ప్రిన్సిపల్ ప్రిన్సిపల్ డాక్టర్ అన్నపూర్ణ శారద అన్నారు. మంగళవారం కళాశాల విద్యార్థుల చేత ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని ప్రతిజ్ఞ చేయించారు. ఎన్ఎస్ఎస్, ఐక్యూఏసి కోఆర్డినేటర్ డాక్టర్ వెంకటేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

విజయపురం : ప్రతి గ్రామంలో స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమాలు చేపట్టాలని శ్రీహరిపురం హెచ్ఎం జ్ఞానప్రకాష్ తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం శ్రీహరిపురం ఉన్నత పాఠశాల ఆవరణంలో మొక్కలు నాటారు. అనంతరం ప్రతి ఒక్కరు ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఎక్కడ పడితే అక్కడ చెత్త వేయరాదని అవగాహన ర్యాలీ నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి బాబు, ఉపాధ్యాయులు వెంకమరాజు, విజయకుమార్, గోపి, విజయవర్మ పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రతతో రోగాలు దూరం: ఎమ్మెల్యే మురళీమోహన్



పూతలపట్టులో..

పూతలపట్టు: వ్యక్తిగత పరిశుభ్రతతో 60 శాతం రోగాలను దూరం చేయవచ్చు అని, ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ ప్రజలకు సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై డ్వాక్రా మహిళలు, విద్యార్థులు, అధికారులు కలిసి పరిసరాల పరిశుభ్రత పై అవగాహన కల్పిస్తూ మానవహారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నేటి నుంచి వారం రోజులపాటు ప్రతి గ్రామంలో సంబంధిత పంచాయతీ అధికారుల పర్యవేక్షణలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం ద్వారా పరిసరాల పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించాలని సూచించారు. టిడిపి మండల కన్వీనర్ దొరబాబు, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

బైరెడ్డిపల్లి: స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీవో రాజేంద్ర బాలాజీ కోరారు. ఈకార్యక్రమంలో భాగంగా స్వచ్ఛతపై ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించినట్లు తెలిపారు. మంగళవారం అన్ని గ్రామపంచాయతీలో స్వచ్ఛతపై ప్రతిజ్ఞ చేయించి, ర్యాలీలు, మానవహారం నిర్వహించారు. స్వచ్ఛభారత్ మండల కోఆర్డినేటర్ సురేష్ బాబు, పంచాయతీ కార్యదర్శి సదాశివయ్య, వెల్ఫేర్ అసిస్టెంట్ భారతి, సచివాలయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



బైరెడ్డిపల్లిలో..

సోమల: మండలంలోని ఆవులపల్లె పంచాయతీ సచివాలయంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా సచివాలయ సిబ్బందికి గ్రామ ప్రజలకు పరిసరాల పరిశుభ్రత ఆరోగ్యం పంచాయతీ అభివృద్ధి తదితర అంశాలపై గ్రామ సభను నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి మణికుమార్ మాట్లాడుతూ పారిశుధ్యంపై అవగాహన పెంచుకొని మరొకరికి పారిశుధ్యం పై తెలియజేసే విధంగా ప్రతి ఒక్కరు ముందుకు నడవాలని కోరారు.

పలమనేరు: స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా పట్టణంలో మంగళవారం మున్సిపల్ కమీషనర్ రమణారెడ్డి ఆధ్వర్యంలో మునిసిపల్ ఆఫీస్ నుండి అంబేద్కర్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ సర్కిల్‌లో పరిసరాల పరిశుభ్రత, ఆరోగ్యంపై మానవహారం నిర్వహించారు. వార్డు కౌన్సిలర్లు, పాఠశాల విద్యార్థులు, సచివాలయ ఉద్యోగులు, మెప్మా ఉద్యోగులు, పట్టణ పరిరక్షణ సమితి సభ్యులు పాల్గొన్నారు.



పలమనేరులో..

నేడు ఏచూరి సంస్మరణ సభ

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి సంస్మరణ సభను సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు ఓ ప్రకటనలో తెలిపారు. యశోద నగర్ లోని వేమన విజ్ఞాన కేంద్రంలో జరిగే సంస్కరణ సభకు ముఖ్యఅతిథిగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు, తిరపతి ఎంపీ డాక్టర్ గురుమూర్తి, మాజీ మంత్రి పరసారత్నం, మాజీ ఎమ్మెల్సీ విటపు బాలసుబ్రమణ్యం, స్విమ్స్ మాజీ డైరెక్టర్ జి. సుబ్రహ్మణ్యం, చాంబర్ ఆఫ్ కామర్స్ నాయకులు కెవి చౌదరి, మోహన్ కుమార్ రాజు, మాజీ కేంద్రమంత్రి డాక్టర్ చింతా మోహన్, మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి, జనసేన నాయకులు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, సిపిఐ జిల్లా కార్యదర్శి మురళి, ఆర్‌పిఐ దక్షిణాది రాష్ట్రాల అధ్యక్షులు పి అంజయ్య, గోవిందధామం వ్యవస్థాపకులు టెంకాయల దామోదరం హాజరుకానున్నారు. ఉదయం 10.30 గంటలకు జరిగే సభకు అభిమానులు విచ్చేసి నివాళి అర్పించాలని కోరారు.

శెట్టిపల్లి భూములు పరిశీలన

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

శెట్టిపల్లి భూములను మంగళవారం తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య పరిశీలించారు. దీర్ఘకాలికంగా నలుగుతున్న శెట్టిపల్లె భూ సమస్యకు పరిష్కారం చూపాలని ఏళ్ళ తరబడి బాధితులు ప్రజాప్రతినిధులు, అధికారుల చుట్టూ తిరుగుతూ వినతులు ఇస్తూనే ఉన్నారు. ప్రభుత్వాలు మారినా, అధికారులు మారినా సమస్యకు పరిష్కారం చూపడంలో జాప్యం జరుగుతోందని శెట్టిపల్లి భూ బాధితులు తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య ఎదుట వాపోయారు. మంగళవారం శెట్టిపల్లె భూములను కమిషనర్ మౌర్య రెవెన్యూ డిప్యూటీ తహసీల్దార్ ఇతర అధికారులతో కలిసి పరిశీలించారు. నగరపాలక సంస్థలో శెట్టిపల్లి రైతులు, భూ బాధితులు, ఫ్లాట్ల కొనుగోలుదారులకు పరిష్కారం చూపేంత నిధులు లేవని కమిషనర్ తెలిపారు. శెట్టిపల్లి భూ పరిరక్షణ కమిటీ అధ్యక్షులు రాధాకష్ణ మాట్లాడుతూ ఫ్లాట్లు అయినా కేటాయింపు చేసి, గ్రావెల్ ద్వారా రోడ్డు మార్గాలను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. తొందర్లో ఇందుకు సంబంధించిన ప్రక్రియను ప్రారంభిస్తామని కమిషనర్ మౌర్య బాధితులకు భరోసా ఇచ్చారు.



టీడీపీలో చేరిక


ఎమ్మెల్యే సమక్షంలో టీడీపీలో చేరుతున్న హరీష్

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: మండలంలోని ఎట్టేరి గ్రామానికి చెందిన హరీష్ యాదవ్ వైసీపీకి రాజీనామా చేశారు. ఇనాళ్లు ఆయన వైసీపీ రాష్ట్ర యువజన విభాగం జాయింట్ సెక్రటరీగా వ్యవహరించారు. ఆ మేరకు పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. సోమవారం రాత్రి చెన్నైలో ఎమ్మెల్యే డాక్టర్ థామస్ ఆధ్వర్యంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. నాయకులు స్వామిదాస్, కోదండరెడ్డి, శిల్ప, మునిరాజుల యాదవ్, శరవణ కుమార్, జ్యోతి యాదవ్, నియాజ్ అలీ, నీరజాక్షులు రెడ్డి, శేఖర్, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

ఈ-పంట నమోదు తప్పనిసరి

ప్రజాశక్తి-గుడిపల్లి: రైతులు వారి పంటలకు తప్పని సరిగా ఈ-పంట నమోదు చేసుకోవాలని వ్యవసాయ అధికారి నాగరాజు పేర్కొన్నారు. మండలంలోని చిన్నగొల్లపల్లి, సంగనపల్లి, గుడిపల్లి, గుండ్లసాగరం ఆర్‌బీకేలో ఈ-కేవైసీ నమోదును పరిశీలించారు. తప్పని సరిగా రైతులు పంట నమోదు పూర్తి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

నోటు పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి-విజయపురం: మండలంలోని మహారాజపురం, కేవసపురం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు రిటైర్డ్ హెచ్ఎం చంద్రయ్య, ఉపాధ్యాయుడు దొరస్వామి మంగళవారం నోటు పుస్తకాలను పంపిణీ చేశారు. దాతలు అందించే విద్యా సామగ్రిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని, తమ పిల్లలను ప్రభుత్వం పాఠశాలలోనే చేర్చాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం మణి, సుష్మ, అంగన్‌వాడీ టీచర్ సరసమ్మ, పాల్గొన్నారు.

పాఠశాల తనిఖీ


విద్యార్థులతో మాట్లాడుతున్న జెడ్పీ ఛైర్మన్

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: మండలంలోని పాలేరు ప్రాథమిక పాఠశాల, సచివాలయ కేంద్రాలను మంగళవారం జెడ్పీ ఛైర్మన్ శ్రీనివాసులు తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థులకు ప్రభుత్వ పరంగా అందిస్తున్న విద్యాసామగ్రి, మధ్యాహ్న భోజనం గురించి అడిగితెలుసుకున్నారు. అనం తరం సచివాలయంకి వెళ్లి అక్కడి సిబ్బందితో మాట్లాడారు. ప్రజల వద్ద నుంచి వస్తున్న దరఖాస్తులకు స్పష్టమైన సమాదానం ఉండాలని సూచించారు. సకాలంలో సర్టిఫికేట్లు అందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శులు ఆయేషా జులేఖ, శివకుమార్, సిఆర్‌పి ప్రేమలత తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు సాయం అందజేత

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: విజయవాడ వరద బాధితులకు మండలంలోని వివిధ చర్చి పాస్టర్లు కలసి సాయాన్ని అందించనున్నారు. పాస్టర్లు గుణశేఖర్, శామ్యూల్, తిమోతి, వరప్రసాద్‌లు తమ వంతు సాయంగా రూ.12వేలు, ఆహార పదార్థాలను తీసుకొని మంగళవారం విజయవాడకు బయలుదేరి వెళ్లారు. బుధవారం విజయవాడలో స్వయంగా బాధితులకు అందజేయనున్నట్లు వారు తెలిపారు.

ఎస్ఆర్ పురం: రజక చైతన్య సేవా సంస్థ ఆధ్వర్యంలో వరద బాధితులకు నిత్యావసర సరుకులను మంగళవారం విజయవాడ రాష్ట్ర కార్యాలయంలో అందజేశారు. కార్వేటినగరం మండలం కొల్లాగుంటకు చెందిన సేవా సంస్థ మహిళా అధ్యక్షులు మోహన వల్లి చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో సంస్థ కమిటీ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

క్రీడా సామగ్రి వితరణ



క్రీడా సామగ్రిని అందజేస్తున్న డాక్టర్ సునీల్‌కుమార్

ప్రజాశక్తి-కుప్పం టౌన్: పట్టణంలోని వైసి జేమ్స్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు కుప్పం ఇంజనీరింగ్ కళాశాల ఉపాధ్యక్షులు డాక్టర్ సునీల్ రాజ్ క్రీడ సామగ్రిని ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడా సామగ్రి అవసరాన్ని లయన్స్ క్లబ్ తెలిపినట్లు చెప్పారు. వారి విజ్ఞప్తి మేరకు విద్యార్థుల సౌకర్యార్థం క్రీడా సామగ్రిని అందించామన్నారు. విద్యార్థులు క్రీడలలో రాణించాలని సూచించారు. అదే విధంగా క్లబ్ అడ్వైసర్ డాక్టర్ మహేష్ మాట్లాడుతూ అడిగిన వెంటనే రూ.50వేల రూపాయలు విలువచేసే క్రీడా సామగ్రిని అందజేసిన బిసిఎన్ విద్యాసంస్థల ఉపాధ్యక్షులకు అభినందనలు తెలిపారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జగన్నాథరావు తమ కళాశాల విద్యార్థుల తరఫున దాతను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు పిజి సెల్వం, సెంథిల్, ప్రసాద్, చరణ్, కృష్ణమూర్తి, జ్యోత్స్న, శిరీష, కళాశాల పీడీ డాక్టర్ రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆకట్టుకున్న భీష్మ ప్రతిజ్ఞ హరికథ

ప్రజాశక్తి-సోమల: మండలంలోని కందూరు గ్రామంలో సోమవారం నుండి ప్రారంభమైన మహాభారత యజ్ఞంలో మంగళవారం మధ్యాహ్నం హరికథ భాగవతారిని గీతశ్రీ ఆలపించిన భీష్మ ప్రతిజ్ఞ భక్తులను ఆకట్టుకుంది. మహాభారత ఘట్టాలలో భీష్మ ప్రతిజ్ఞ ఎంతో ప్రాచుర్యం పొందిందని ఆమె కథ వినడానికి వచ్చిన భక్తులకు వినసొంపుగా అర్థమయ్యే రీతిలో భీష్మ ప్రతిజ్ఞ శ్రోతలకు వినిపించారు. ప్రక్క వాయిద్యాలుగా తబలా డమరేశ్వర, హార్మోనియం సురేష్ బాబు సహకారం అందించారు.

నాడి పట్టి.. వైద్యం చేసి..

- దాసర్లపల్లిలో వైద్య శిబిరం ఏర్పాటు
- యంత్రాంగాన్ని కదిలించిన ప్రజాశక్తి వార్త


దాసర్లపల్లెలో వైద్య సేవలందిస్తున్న డాక్టర్లు

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: బస్సు సౌకర్యం కూడా లేని ఆ పల్లె వాసులకు జ్వర మొచ్చింది.. ఊరంతా జ్వరాల బారిన పడి ఇబ్బంది పడుతున్నారు. సకాలంలో వైద్యం అందక, ఆసుపత్రికి వెళ్లలేక సతమతమవుతున్న పరిస్థితి బైరెడ్డిపల్లి మండలం కంభంపల్లి పంచాయతీ దాసర్త పల్లెలో నెలకొంది. దీంతో ఆ గ్రామస్తులు ఆదివారం ప్రజాశక్తికి సమాచారం ఇచ్చారు. సోమవారం 'జ్వరాల విజృంభణ' శీర్షికన కథనం ప్రచురితమైంది. అప్రమత్తమైన అధికారులు మంగళవారం ఆ గ్రామంలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. జ్వరాల బారిన పడి ఇబ్బంది పడుతున్న గ్రామస్తులకు వైద్య సేవలందించారు. డాక్టర్ అరుణకుమార్, డాక్టర్ పద్మావతి పర్యవేక్షణలో వైద్య పరీక్షలు చేసి జ్వరాలతో బాధపడుతున్న వారికి మందులు పంపిణీ చేశారు. సర్పంచ్ కోదండ రెడ్డి సహాయ సహకారాలు అందించారు. పల్లెలో జ్వరాల సమస్యను తెలుసుకొని కథనం ప్రచురించిన ప్రజాశక్తికి వారు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సురేష్, ఏఎన్ఎం కవిత, ఎంఎల్‌హెచ్‌పి నవీన, ఆశ వర్కర్ రామాంజులమ్మ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ భారత్‌కు శ్రీకారం చుట్టండి

ప్రజాశక్తి-విజయపురం: స్వచ్ఛ భారత్‌లో భాగంగా ప్రతి గ్రామంలో పరిశుభ్రత పాటించాలని శ్రీహరిపురం హెచ్ఎం జ్ఞానప్రకాష్ అన్నారు. స్వచ్ఛ భారత్ మిషన్‌ను ప్రారంభించి 10యేళ్ల పూర్తయిన సందర్భంగా మంగళవారం పాఠశాల ఆవరణంలో మొక్కలు నాటారు. ముందుగా గ్రామాల్లో ర్యాలీ చేపట్టారు. ప్రతి ఒక్కరు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బాబు, ఉపాధ్యాయులు వెంకమరాజు, విజయకుమార్, గోపి, విజయవర్మ తదితరులు పాల్గొన్నారు.

వెదురుకుప్పం: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందించేందుకు కృషి చేయాలని వైఎస్సార్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ అన్నపూర్ణ శారద అన్నారు. మంగళవారం కలాశాల ఆవరణంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో ఎన్ఎస్-ఎస్, ఐక్యూఏసి కోఆర్డినేటర్ డాక్టర్ వెంకటేష్, విద్యార్థులు, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

నేడు షూటింగ్ బాల్ జట్టు ఎంపిక

ప్రజాశక్తి-రామకుప్పం: జిల్లా జూనియర్ బాల, బాలికల షూటింగ్ బాల్ జట్టును ఈనెల 18వ తేదీన ఎంపిక చేయనున్నట్లు షూటింగ్ బాల్ జిల్లా సెక్రటరీ వేణుగోపాల్ తెలిపారు. రామకుప్పం సమీపంలోని అంబేద్కర్ గురుకుల పాఠశాల మైదానంలో బుధవారం ఉదయం 9గంటలకు ఎంపిక ప్రారంభమవుతుందన్నారు. క్రీడాకారులు తమ వెంట ఆధార్, జనన ధ్రువీకరణ, రెండు ఫోటోలు తీసుకొని రావాలన్నారు. క్రీడాకారులు జనవరి1, 2005 వ తేదీ తరువాత పుట్టిన వారై ఉండాలన్నారు. ఇతర వివరాలుకు 6301831236 ఫోన్ నెంబర్‌కు సంప్రదించాలని కోరారు.

నులి పురుగులను నులిమేద్దాం: ఎంపి దగ్గుమళ్ల


విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలు వేస్తున్న ఎంపి, కలెక్టర్ తదితరులు

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: ఆరోగ్యవంతమైన పిల్లల కోసం నులిపురుగులను నులిమేద్దామని చిత్తూరు ఎంపి దగ్గుమళ్ల ప్రసాదరావు అన్నారు. మంగళవారం నగరంలోని లిటిల్ ఫ్లవర్ స్కూల్‌లో జాతీయ నులి పురుగుల దినోత్సవం సందర్భంగా కలెక్టర్ సుమిత్‌కుమార్‌తో కలిసి విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను అందించారు. ఈ సందర్భంగా ఎంపి మాట్లాడుతూ 1-19 ఏళ్ల పిల్లలందరికీ ఆల్బెండజోల్ మాత్రలు తప్పనిసరి అన్నారు. మాత్రలు వేసే ముందు ఆరోగ్య పరిస్థితిని తెలుసుకోవాలన్నారు. చిన్నపిల్లల్లో నులిపురుగుల సంక్రమణం వల్ల రక్తహీనత, పోషక లోపం కనిపిస్తాయని దీన్ని నివారించేందుకు ఆల్బెండజోల్ మాత్రలను వేసుకునేలా వైద్యఆరోగ్య శాఖ సిబ్బంది, విద్యాశాఖ అధికారులతో సమన్వయం చేసుకోవాలన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ పిల్లలు ఆరోగ్యవంతంగా ఎదగడానికి వ్యక్తిగత పరిశుభ్రత ఎంతగానో తోడ్పడుతుందని, పిల్లలు నులిపురుగుల సమస్యలతో బాధ పడుతున్నట్లైతే బరువు తగ్గి వారి ఆరోగ్య ఎదుగుదల నిలిచిపోయి రోగాల బారిన పడతారని దీనిని నివారించేందుకు జాగ్రత్తలు పాటించాలన్నారు. తొలి రోజున 96.4శాతం పూర్తి అయిందని అధికారులు తెలిపారు. మిగిలిన వారికి 25వ తేదీనపూర్తి చేయాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో డిఐఓ డాక్టర్ హనుమంతరావు, మాజీ ఎమ్మెల్సీ, మేయర్‌లు దొరబాబు, కటారి హేమలత, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఆర్ పురం: నులి పురుగు నివారణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని మండల వైద్యాధికారి డాక్టర్ సందీప్, డాక్టర్ బాలసుబ్రమణ్యం రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. తగు ఆరోగ్య జాగ్రత్తలను సూచించారు. కార్యక్రమానికి ఎంఈవో సబర్మతి, హెచ్ఎం శ్రీనివాసులు, సూపర్వైజర్ గంగాదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

బైరెడ్డిపల్లి: మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు, అంగన్వాడీ కేంద్రాల్లో జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు.

కార్వేటినగరం: ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ప్రైమరీ హెల్త్ సెంటర్ వారి సహకారంతో జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ విజయులు రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ ధనంజయ రెడ్డి, శిరీష, మంజుల, డాక్టర్ బాలసుబ్రహ్మణ్యం ఆచారి, డాక్టర్ లతా తదితరులు పాల్గొన్నారు.

కుప్పం టౌన్: పట్టణంలోని కొత్తపేట ఆరోగ్య కేంద్రంలో వైద్యులు డాక్టర్ దీప్ కుమార్, డాక్టర్ సాయి హేమంత్‌ల ఆధ్వర్యంలో జాతీయ నులిపురుగు నిర్మూలన కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులకు పురపాలక సంఘం కమిషనర్ శ్రీనివాస రావు చేతుల మీదుగా మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆరోగ్య కేంద్రం సూపర్వైజర్ సుమిత్ర, సిబ్బంది పాల్గొన్నారు. అదేవిధంగా ద్రావిడ విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో యూనివర్సిటీ ఆవరణలో నులి పురుగులు నివారణకు మాత్రలు పంపిణీ చేపట్టారు. విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య దొరస్వామి, కులసచివులు ఆచార్య కిరణ్ కుమార్ విద్యార్థులు ఆరోగ్యంపైన తీసుకోవలసిన జాగ్రత్తలను గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో యశోద, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ హరికృష్ణ, డాక్టర్ కిషోర్, డాక్టర్ శోభారాణి, డాక్టర్ శైలమ్మ పాల్గొన్నారు.

సోమల: జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం వైద్యులు సోనియా ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు.

గంగవరం: పత్తికొండ ప్రభుత్వ వైద్య కేంద్రం పరిధిలోని పాఠశాలల విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను అందజేసినట్లు వైద్యాధికారి డాక్టర్ మల్లికార్జున తెలిపారు.


కుప్పంలో

గంగాధర నెల్లూరు: మండలంలోని ఆగరమంగళం గ్రామంలో ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను ఎంఈఓ ఆంజనేయులు శెట్టి పంపిణీ చేశారు. కార్యక్రమంలో సిబ్బంది జీవలక్ష్మి, యమునా, త్రిపుర సుందరి పలువురు పాల్గొన్నారు.

వెదురుకుప్పం: స్థానిక వైఎస్సార్ డిగ్రీ కళాశాలలో జాతీయ నులిపురుగుల దినోత్సవం సందర్భంగా మంగళవారం ప్రిన్సిపల్ డాక్టర్ అన్నపూర్ణ శారద ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ శిల్ప, సిబ్బంది యర్రసానమ్మ, తదితరులు పాల్గొన్నారు.

విజయపురం: విజయపురం ఉన్నత పాఠశాలలో ఎంపీడీవో చంద్రమౌళి ఆధ్వర్యంలో విద్యార్థులు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఈవోఆర్‌డీ సురేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ నీరు అందించడమే లక్ష్యం: ఎమ్మెల్యే

ప్రజాశక్తి -రామచంద్రాపురం: మండల ప్రజలకు శుద్ధమైన తాగు నీటిని అందించటమే ప్రభుత్వ లక్ష్యంగా సిఎం ఆదేశంతో ముందుకు సాగుతున్నామని, ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రజలకు తాగడానికి మంచినీరు అందిస్తానని ఇచ్చిన మాట ప్రకారం స్వచ్ఛమైన మంచి నీటిని ప్రజలకు అందించడమే లక్ష్యంగా కృషి చేస్తున్నామని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. ఇందులో భాగంగా చంద్రగిరి నియోజకవర్గంలో రామచంద్రాపురం మండలం, పివిపురం పంచాయతీ, బలిజపల్లి గ్రామంలో, కమ్మకండ్రిగ పంచాయతీ, మిట్టూరు ఏ ఏ డబ్ల్యూ కాలనీలో, సి రామాపురం పంచాయతీలలో మంగళవారం వాటర్ ప్లాంటును ప్రారంభించారు. గ్రామానికి చేరుకున్న ఎమ్మెల్యేకి ఉమ్మడి పార్టీ కార్యకర్తలు మేళతాళాలతో స్వాగతం పలికి శాలువా కప్పి, గజమాలతో సత్కరించారు. వేద పండితులు పూర్ణకుంభంతో ఆహ్వానం పలికారు. ఎమ్మెల్యే పులివర్తి నాని రిబ్బన్ కత్తరించి కుళాయి నీటిని సరఫరా చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వ ప్రాణులకు నీరు జీవనాధారమని చెప్పారు. కలుషితమైన నీటిని తాగి ఎంతోమంది అనారోగ్యం పాలవుతున్నట్లు తెలి పారు. ఎన్నికల ముందు ఇచ్చిన మాట ప్రకారం ఒక్కొక్కటిగా అమలు పరుస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. ప్రజలకు స్వచ్ఛ మైన మంచి నీరు అందించడం ఎంతో సంతోషాన్ని కలిగిస్తుందన్నారు. ప్రతి గ్రామంలో రక్షిత మంచినీటి పథకాలను ఆధునిక సాంకేతికతో ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో మండల ఉమ్మడి కూటమి నాయకులు, ఎం తిరుమలరెడ్డి, జనార్దన్ చౌదరి, కే నరసింహారెడ్డి, కార్యకర్తలు, యువత, మహిళలు పాల్గొన్నారు.


తాగునీటి ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నాని

ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ తప్పనిసరి: ఎస్ఐ

ప్రజాశక్తి-ఎస్ఆర్ పురం: ద్విచక్ర వాహనదారులు తప్పని సరిగా హెల్మెట్ వినియోగించాలని ఎస్ఐ సుమన్ సూచించారు. మంగళవారం మండల కేంద్రంలో వాహనదారులకు అవగాహన కల్పించారు. హెల్మెట్ ఆవశ్యకతను వివరించారు. రోడ్డు నియమ నిబంధనలు పాటించాలని సూచించారు.

రంగయ్య నాయుడు మృతికి నివాళి

ప్రజాశక్తి-పలమనేరు: పలమనేరు మాజీ వైస్ ఎంపీపీ రంగయ్య నాయుడు మృతి పట్ల ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డి సంతాపాన్ని తెలిపారు. పలమనేరు మండలం మొరం పంచాయతీ రామాపురం గ్రామానికి చెందిన రంగయ్య నాయుడు అనారోగ్యం కారణంగా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం చెందారు. పలమనేరు మండల రాజకీయాల్లో క్రియాశీలకంగా వ్యవహరించిన రంగయ్య మృతి బాధాకరమని ఎమ్మెల్యే దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

ఎస్వియూలో పిజి తరగతులు ప్రారంభం

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో 2024 -25 విద్యా సంవత్సరానికి మొదటి విడతలో ఎ ఎస్సీ, ఎంఎ, ఎంకాం కోర్సులు చదవడానికి పిజి చేరిన విద్యార్థులకు తరగతులు ప్రారంభమయ్యాయని , క్రమం తప్పకుండా తరగతులు జరుగుతున్నాయని రిజిస్ట్రార్ ఆచార్య ఎం.భూపతి నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్వీయూలో వివిధ కోర్సుల్లో పిజి చేరిన విద్యార్థులకు మొదటి సెమిస్టర్ సిలబస్‌తో తరగతులు ప్రారంభమయ్యాయని విద్యార్థులు క్రమం తప్పకుండా హాజరు కావాలని, హాజరు శాతం తగ్గిన విద్యార్థులను పరీక్షలకు అనుమతించబోమని, హాజరు తగ్గిన విద్యార్థులకు నిబంధనల ప్రకారం స్కాలర్షిప్ సౌకర్యం కూడా వుండదని సంబంధిత కళాశాలల ప్రిన్సిపాల్స్ ఆచార్య తులసీ రామకృష్ణారెడ్డి, ఆచార్య పద్మనాభం, ఆచార్య నరసయ్య ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు.

విద్యార్థుల పోరాటానికి మద్దతు: ఎంపి

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: విద్యార్థుల పోరాటానికి తాను మద్దతు ఇస్తున్నాని ఎంపి డాక్టర్ గురుమూర్తి తెలిపారు. తిరుపతిలో సీపీఐ కార్యాలయంలో మంగళవారం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో వైద్య కళాశాలల ప్రైవేటీకరణను నిరసిస్తూ చేపట్టిన అఖిలపక్ష సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ చిన్న పిల్లలు మొదలుకుని వైద్య విద్యార్థులు చదువుకునే కళాశాలల వరకూ మెరుగైన వసతుల కల్పనకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని తమ ప్రభుత్వం వేలాది కోట్లు ఖర్చు చేసిందన్నారు. అన్ని విద్యార్థి సంఘాల నాయకులు సదాశయం కోసం సంఘటితమై పోరాటం చేసి లక్ష్యాన్ని సాధించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ పోరాటంలో తుది వరకూ తాను అండగా వుంటానని ఆయన భరోసా ఇచ్చారు. వైద్య కళాశాలల ప్రైవేటీకరణను నిరసిస్తూ ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో చేపట్టిన అఖిలపక్ష సమావేశంలో అన్ని విద్యార్థి సంఘాల రాయలసీమ రీజన్ నాయకులు పాల్గొన్నారు.

నిర్మానుష్యంగా రహదారులు

- ఎండ వేడిమికి బెంబేలెత్తిపోతున్న జనం



ప్రజాశక్తి-వెదురుకుప్పం: జిల్లా వ్యాప్తంగా వారం రోజుల నుంచి ఉష్ణోగ్రత పెరిగింది. ఎండ తీవ్రతకు ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. ఇంట్లో ఫ్యాను, ఏసీల వద్ద సేదతీరుతున్నారు. పొలాల్లో రైతులు చెట్టు కిందకు చేరి ఉపశమనం పొందుతున్నారు. కాగా మంగళవారం మధ్యాహ్నం అధిక ఉష్ణోగ్రత కారణంగా మండలంలోని పచ్చికాపల్లం రహదారి నిర్మానుష్యంగా కనిపించింది. పల్లిపట్టు, గంగాధరనెల్లూరు, చిత్తూరు రహదారలన్నీ బోసిపోయి కనిపించాయి. ఎండ్ర తీవ్రతకు ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. వాతావరణ మార్పులతో జ్వరాలు, అనారోగ్య పరంగా బాధపడుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు.

ఘనంగా మోడీ పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి-కుప్పం టౌన్: పట్టణంలో దేశ ప్రధాని నరేంద్ర మోడీ పుట్టిన రోజు వేడుకలను నియోజకవర్గ బిజెపి నాయకులు డాక్టర్ శివ శంకర్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక తిరుపతి గంగమ్మ దేవాలయంలో ప్రధాని పేరుపై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆ తరువాత బస్టాండు కూడలిలో కేక్ కట్ చేసి అభిమానులకు పంచిపెట్టారు. పెద్ద ఎత్తున అన్నదానం చేపట్టారు.

గంగాధరనెల్లూరు: ప్రధాని నరేంద్ర మోడీ పుట్టినరోజు వేడుకలను మంగళవారం జీడీ నెల్లూరులో కూటమి నేతలు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి పంచిపెట్టారు. కార్యక్రమంలో నాయకులు చేసి మణివర్మ, సుధాకర్, మురళి, వెంకటేష్, స్వామిదాస్, దేవసుందరం, సుందరరాజ్, కృష్ణమూర్తి రెడ్డి, సురేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థుల సామర్థ్యాన్ని పెంపొందించాలి: డీఈవో

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: విద్యార్థుల సామర్థ్యాన్ని పెంపొందించేందుకే ప్రత్యేక శిక్షణ తరగతులు అవసరమని జిల్లా విద్యాశాఖ అధికారి దేవరాజులు అన్నారు. మంగళవారం మండలంలోని గుండ్ల కట్టమంచి ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న సిఆర్‌సి ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల ఎదుగుదలకు ఉపాధ్యాయుల కీలకమని సమాజ అభివృద్ధి ఉపాధ్యాయులతోనే అవుతుందని ప్రాథమిక దశలోనే విద్యార్థుల పట్ల శ్రద్ధ కనబరచి వారికి చదవడం రాయడం నేర్పించాలని దీనికి అనుగుణంగా పాఠ్యాంశాలను ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్నదని తద్వారా విద్యార్థులు ఉన్నత శిఖరాలకు ఎదుగుతారన్నారు. ఉపాధ్యాయులు శిక్షణ కార్యక్రమాలకు గైర్హాజరు కాకుండా శిక్షణా కార్యక్రమాలకు హాజరై సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కనీస అభ్యాసన సామర్థ్యలు సాధించాలి అని తెలిపారు. కార్యకమంలో ప్రాజెక్ట్ అధికారి వెంకటరమణారెడ్డి, మండల విద్యా శాఖాధికారులు నాగేశ్వరరావు, రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.


శిక్షణా తరగతులలో మాట్లాడుతున్న డీఈవో దేవరాజులు

చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడొద్దు: సిఐ

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: యువత చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడ కూడదని శ్రీకాళహస్తి 1వ పట్టణ సిఐ డి గోపి సూచించారు. ఎస్‌పి సుబ్బరాయుడు ఉత్తర్వుల మేరకు శ్రీకాళహస్తి పట్టణంలోని రాలయసీమ జూనియర్ కళాశాలలో మంగళవారం విద్యార్థులకు డ్రగ్స్, మహిళలపై జరిగే నేరాలు, సైబర్ క్రైమ్స్, ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ డి గోపి మాట్లాడుతూ..కొంతమంది యువత మాదక ద్రవ్యాలకు అలవాటు పడి తమ భవితను నాశనం చేసుకుంటున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మాదక ద్రవ్యాలు వినియోగిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. విద్యార్థులు తమ తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆయన ఆకాంక్షించారు. ఇక ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించకూడదని, అలా ఎవరైనా చేస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. సైబర్ నేరాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న శ్రీకాళహస్తి సిఐ డి.గోపి

ఘనంగా మున్సిపల్ వైస్ ఛైర్మన్ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : స్థానిక మున్సిపల్ వైస్ ఛైర్మన్, మాజీ జెడ్‌పిటిసి, బలిజ సంఘం సీనియర్ నాయకులు, విద్యాసంస్థల అధినేత, విద్యావేత్త డి జయప్రకాష్ (చిట్టి) 60వ జన్మదినాన్ని పురస్కరించుకుని మంగళవారం ఆయన నివాసానికి పలువురు బలిజ సంఘం నాయకులు వెళ్లి ఘనంగా శాలువా కప్పి సన్మానించి శుభాకాంక్షలు, అభినందనలు తెలిపారు. అనంతరం ఆయన జన్మదిన కేకును కట్ చేశారు. ఈ సందర్భంగా బలిజ సంఘం నాయకులు మాట్లాడుతూ జయ ప్రకాష్ అనేక సేవా కార్యక్రమాలు చేస్తూ ప్రజలకు ఎంతో మేలు చేస్తున్నారన్నారని ఆయనకు శుభాకాంక్షలు తెలిపి నిండు నూరేళ్లు చల్లగా మరెన్నో సేవా కార్యక్రమాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పుత్తూరు బలిజ సంఘం అధ్యక్షులు శివ మెకానికల్, గోపి రాయల్, కొడగంటి రమేష్, కృష్ణయ్య, మునెయ్య, బలిజ సంఘం నాయకులు పాల్గొన్నారు.


మున్సిపల్ వైస్ ఛైర్మన్ డి జయప్రకాష్‌ను సన్మానిస్తున్న బలిజ సంఘం నాయకులు

ఇంటింటి ఓటర్ల సర్వే వేగంగా చేపట్టండి. : కమిషనర్

ప్రజాశక్తి -తిరుపతి టౌన్ : తిరుపతి నియోజకవర్గ పరిధిలో చేస్తున్న ఇంటింటి ఓటర్ల సర్వేను వేగంగా నిర్వహించాలని ఓటర్ నమోదు అధికారి ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. ఇంటింటి ఓటర్ల సర్వే నిర్వహణపై మంగళ వారం తిరుపతి నగరపాలక సంస్థ సమావేశం మందిరంలో సూపర్ వైజర్లు, అసిస్టెంట్ సూపర్ వైజర్లతో తిరుపతి నియోజకవర్గ ఓటర్ నమోదు అధికారి ఎన్.మౌర్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, అర్బన్ తహశీల్దార్ భాగ్యలక్ష్మి, డిటి జీవన్ పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం దగ్ధం

హడలెత్తిన జనం



దగ్ధమవుతున్న బైక్

ప్రజాశక్తి-రామకుప్పం: మండల కేంద్రమైన రామకుప్పం నుంచి బందర్లపల్లి వైపు వెళ్లే బైపాస్ రోడ్డులోని ఓ వెల్డింగ్ దుకాణం వద్ద మంగళవారం ద్విచక్ర వాహనం అగ్ని ప్రమాదంలో దగ్ధమైంది. దీంతో ఎక్కడ పెను ప్రమాదం చోటు చేసుకుంటుందో నని స్థానికులు హడలి పోయారు. వివరాలు.. ద్విచక్ర వాహనం మరమ్మతుల కోసం వెల్డింగ్ షాపుకు తీసుకొచ్చారు. వెల్డింగ్ చేస్తుండగా వాహనంలో పెట్రోల్ లీకేజ్ కావడంతో ఒక్క సారిగా మంటలు చెలరేగాయి. చుట్టుపక్కల స్థానికులు మంటలు ఆర్పేందుకు ప్రయత్నం చేశారు. ఎంతకీ మంటలు అదుపు చేయడానికి వీలు కాక పోవడంతో దుకాణానికి కొంత దూరంలోకి మండుతున్న బైక్‌ని తీసుకొచ్చి విడిచిపెట్టారు. దీంతో పెనుప్రమాదం తప్పింది. పెట్రోల్ వాహనం కావడంతో పూర్తిగా అగ్నికి ఆహుతైంది. ఈ ఘటనతో సుమారు రూ.20వేల నష్టం కలిగిందని స్థానికులు తెలిపారు. అయితే ఇలాంటి దుకాణాల వద్ద అకస్మాత్తుగా జరిగే అగ్ని ప్రమాదాల నివారణకు ఎటువంటి ముందస్తు చర్యలు ఏర్పాటు చేయక పోవటం దురదృష్ట కరం.

బైక్ దొంగ అరెస్ట్

- 4ద్విచక్ర వాహనాలు స్వాధీనం


స్వాధీనం చేసుకున్న బైక్‌లు, నిందితుడిని చూపుతున్న సీఐ

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: నగరంలోని వివిధ ప్రాంతాల్లో పార్క్ చేసి ఉంచిన బైక్‌లు చోరీ చేస్తున్న నిందితుడిని అరెస్ట్ చేసినట్లు టూ టౌన్ సీఐ నెట్టికంఠయ్య తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులకు వివరాలను వెల్లడించారు. నగరంలోని గవర్నమెంట్ ఆసుపత్రి, చర్చివీధి, హై రోడ్డు లోని వింసన్ ఎంటర్ప్రైజెస్ వద్ద రాత్రిల్లో బైక్‌లు చోరీలకు గురవుతున్నట్లు సమాచారం వచ్చిందన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు దర్యాప్తు చేపట్టామన్నారు. ప్రత్యేక బృందాలుగా విడిపోయి పలు కోనాల్లో నిఘా ఉంచామన్నారు. మంగళవారం ప్రశాంత్ నగర్‌లో అయ్యప్పస్వామి గుడి మలువు వద్ద నిందితుడు రామును గుర్తించి అరెస్ట్ చేసినట్లు వెల్లడించారు. అతని వద్ద నుంచి 4 బైక్‌లు రికవరీ చేసినట్లు వివరించారు.